



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## పార్టీలకతీతంగా

# ప్రజా శంఖారావం

**డంపింగ్ యార్డు ఎత్తివేతకు వ్యతిరేకంగా పోరాట కమిటీ తీర్మానం**

**గ్రామాలు, కాలనీల్లో చైతన్యానికి సన్నాహక పాదయాత్రలు**

**జూలై 26న వెయ్యి మంది పర్యావరణవేత్తలతో భారీ సదస్సు**



మాట్లాడుతున్న పోరాట కమిటీ నేతలు

**జవహర్ నగర్, జూన్ 9 ప్రభాతవార్త:** జవహర్ నగర్‌ను కాలుష్య కోరల్లో చిక్కుకోకుండా కాపాడుకోవడమే లక్ష్యంగా స్థానికులు పార్టీలకతీతంగా ప్రజా శంఖారావానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రాణం ఉన్న ప్రతి జీవికి పరిశుభ్రమైన గాలి, నీరు, పర్యావరణం ప్రాథమిక హక్కులని.. కానీ, జవహర్ నగర్ ప్రజల పాలిట డంపింగ్ యార్డు శాపంగా మారబోతోందని గళమెత్తుతున్నారు. రాజకీయ జెండాలను పక్కనపెట్టి, ప్రజాసంఘాలు, సామాజిక శక్తులు ఏకమై.. డంపింగ్ యార్డు ఎత్తివేత కోసం దశలవారీ ఉద్యమ కార్యాచారణకు యార్డు ఎత్తివేత పోరాట కమిటీ తీర్మానించింది. మంగళవారం జవహర్ నగర్ ప్రగతినగర్‌లోని న్యూడెమోక్రసీ మాస్‌లైన్ నీలం రాంచంద్రయ్య భవనంలో జేపీసీ కోకన్వీనర్ల సమావేశం జరిగింది. కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఇందులో భాగంగా.. జూన్ 15న మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించాలని కమిటీ నిర్ణయించింది. 23న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రభుత్వానికి వినతిపత్రం అందజేయాలని, జూలై మొదటి వారంలో డంపింగ్ యార్డు ప్రభావిత గ్రామాలు, కాలనీల్లో ప్రజలను చైతన్య పరిచేందుకు సన్నాహక పాదయాత్రలు నిర్వహించాలని తీర్మానించారు. పరిసర ప్రాంతాల ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను కలిసి ఉద్యమంలో భాగస్వాములను చేస్తామన్నారు. జూలై 26న నిర్వహించబోయే భారీ సదస్సుకు ఉద్యమ స్ఫూర్తితో కదం తొక్కాలని కమిటీ పిలుపునిచ్చింది. పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తల భాగస్వామ్యంతో దాదాపు వెయ్యి మందితో భారీ సదస్సు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రకటించింది. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులు తమ భవిష్యత్తు పోరాట ప్రణాళికను తీర్మానాలను వెల్లడించారు. ఇది ప్రజల జీవించే హక్కు, పరిశుభ్రమైన పర్యావరణ పరిరక్షణ కోసం సాగుతున్న ప్రజాస్వామిక ఉద్యమం. అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, సామాజిక సంస్థలు ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించి విజయవంతం చేయాలి.. అని జేపీసీ నేతల పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు గద్దం సదానందం, బీఆర్ఎస్ నాయకుడు భాషవాని కొండల్ ముదిరాజ్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి పాషా మియా, సీపీఐ నాయకుడు టి. శంకర్, సీపీఎం నాయకుడు టి. శివనారాయణ, న్యూడెమోక్రసీ నాయకురాలు అరుణ, టీయూజేఏసీ నాయకుడు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, జేపీసీ కోశాధికారి పి. శివబాబు తదితరులు పాల్గొన్నారు.

## నారపల్లి సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

**ప్రభుత్వ అసైన్ట్ భూముల గోల్‌మాల్ ఎఫెక్ట్**

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 9, ప్రభాతవార్త:** కొర్రెముల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను అప్పనంగా అక్రమార్కులకు కట్టబెట్టిన నారపల్లి సబ్ రిజిస్ట్రార్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. పోచారం డివిజన్ కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 867తో పాటు పలు సర్వేనెంబర్లలోని అసైన్ట్ భూములు యథేచ్ఛగా సేల్‌డీడ్ జరగడంతో సదరు సబ్ రిజిస్ట్రార్‌పై ఫిర్యాదులు రాగా విచారణ జరిపిన అధికారులు సస్పెన్షన్ చేశారు. కాగా ఈ విషయాన్ని ఉన్నతాధికారులు బయటకు పొక్కకుండా గత నాలుగైదు రోజులుగా గోప్యంగా ఉంచారు. కొర్రెముల భూ అక్రమాలపై అధికారులు ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు తలొగ్గి ప్రభుత్వ అసైన్ట్ భూములను నిషేధిత జబితాలో ఉన్న వాటిని సైతం అధికారులు ప్రైవేటు పరం చేస్తున్నారు. విలువైన ప్రభుత్వ అసైన్ట్‌భూములను సెల్‌డీడ్ చేసిన నారపల్లి సబ్ రిజిస్ట్రార్‌పై వేటు పడింది. కొర్రెముల ప్రభుత్వ భూములపై పత్రికల్లో కథనాలు వెలువడుతున్న అధికారుల్లో ఇప్పటి వరకు ఎలాంటి చలనం లేదు.

## వాన వాన వల్లప్ప...



వరదనీరు స్తంభించిపోవటంతో డ్రెయిన్‌ల పూడికను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



పెనుగాలులకు కూలిన భారీ వృక్షం



చెరువులా మారిన లోయర్ ట్యాంక్ బండ్ సమీపంలోని ఓ రహదారి



పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన మహిళా శక్తి బహిరంగ సభలో భారీ వర్షానికి కుర్చీలనే గొడుగులుగా చేసుకున్న దృశ్యం

*రుతుపవనాల రాకతో భాగ్యనగరంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కుండపోత వాన వేసవి తాపంతో అల్లాడిపోతున్న సిటీ వాసులకు సేద తీర్చింది. అచ్చతెలుగు జానపద గేయం అయిన వాన వాన వల్లప్ప... వాకిలి తిరుగు చెల్లప్ప అంటూ ఇళ్ల అరుగుల మీద నిలబడి ఆనందంగా పాడుకునే చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సిటీ వాసులు పులకరించిపోయారు.*

*కానీ అదే సమయంలో నగరాన్ని ముంచెత్తిన భారీ వర్షం వల్ల జనజీవనం అస్తవ్యస్తమైంది. సిటీలోని పలు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. వరద నీరు రోడ్లపైనే స్తంభించిపోయి స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు.*

## స్వచ్ఛందంగా బయటకు వెళతారా?

# బుల్డోజర్లను దింపమంటారా?

- ★ఆక్రమణ దారులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు
- ★ఇది నా సామ్రాజ్యం అనే ధోరణి చెల్లదు
- ★ఎస్సీలకు ఉద్యానవన, నర్సరీ శిక్షణ కేంద్రాల కోసం ఈ భూమి కేటాయించాం
- ★సర్వే ప్రక్రియ వేగవంతానికి కలెక్టర్‌కు పూర్తి అధికారాలు ఇస్తున్నాం
- ★మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వార్నింగ్
- ★ఆక్రమణల వెనుక మాజీ మంత్రి మల్లారెడ్డి హస్తముందన్న ఆరోపణలతో జిల్లాలో రాజకీయ దుమారం



గుండ్లపోచంపల్లిలో ఎస్సీ కార్పొరేషన్ భూమిని పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**మేడ్చల్, జూన్ 9, ప్రభాతవార్త :** ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన భూములను ఆక్రమించి సామ్రాజ్యాలు నడిపే వారి ఆటలు సాగవని షెడ్యూల్ కులాల అభివృద్ధి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హెచ్చరించారు. గుండ్లపోచంపల్లి శివారులోని సర్వే నంబర్ 509లో గల 49 ఎకరాల 20 గుంటల ఎస్సీ కార్పొరేషన్ భూమిని జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంతో కలిసి మంగళవారం మంత్రి సందర్శించి పరిశీలించారు. ఇటీవల మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఈ భూముల ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, ఈ భూములకు సంబంధించి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పేరును ప్రస్తావిస్తూ ఆరోపణలు రావడం జిల్లాలో రాజకీయ చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే మంత్రి స్వయంగా జిల్లా కలెక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలనకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీల సంక్షేమం కోసం కేటాయించిన భూముల్లో ఒక్క అంగుళం కూడా అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని మంత్రి స్పష్టం చేశారు. కొందరు వ్యక్తులు లోపల ఒక రకంగా, బయట మరో రకంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని విమర్శించారు. అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ గోడలు, ఇతర నిర్మాణాలను ఆక్రమణదారులే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకపోతే ప్రభుత్వం చట్టపరమైన చర్యలతో పాటు బుల్డోజర్లను రంగంలోకి దింపుతుందని హెచ్చరించారు.

ఇది నా సామ్రాజ్యం, నా భూమి గుండా ఎవరూ వెళ్లొద్దు..అనే ధోరణి ప్రజాస్వామ్యంలో చెల్లదని మంత్రి అన్నారు. ఈ భూమిని 1991లో ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన దళిత యువతకు ఉద్యానవన, నర్సరీ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు సేకరించినట్లు మంత్రి తెలిపారు. భూమి సర్వే, పరిరక్షణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు పూర్తి అధికారాలు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు.

నిజాయితీ గల అధికారులతో నిర్దిష్ట గడువులో సర్వే పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. స్థానిక రైతులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యను ప్రస్తావిస్తూ, అవసరమైతే ప్రైవేట్ భూములను భూసేకరణ చేసి అయినా రైతు లకు శాశ్వత రహదారి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీల భూములను ఆక్రమించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్వే పూర్తయి సరిహద్దులు ఖరారైన వెంటనే ప్రభుత్వ నిధులతో భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పూర్తి రక్షణ కల్పిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎస్సీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల అభివృద్ధి కోసం ఈ భూమిలో విద్యా, శిక్షణా కేంద్రాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ హనుమంత్ నాయక్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి బి. శ్రీధర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి. శంకర్, మేడ్చల్ ఆర్డీవో శ్యాంప్రసాద్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి పద్మజ, మేడ్చల్ డిప్యూటీ తహసీల్దార్ అనూష, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మాజీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు ఈశ్వర్, నరేందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గండిపేట్ చెరువును విషం చేస్తారా!

**◆ప్రజారోగ్యం కంటే చెత్త నిర్వహణే ఎక్కువా? ◆డంపింగ్ యార్డ్ తొలగించకపోతే ఉద్యమం తప్పదు: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



హిమాయత్‌నగర్ పరిధిలోని గండిపేట్ చెరువుకు ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మొయినాబాద్, జూన్ 9, ప్రభాతవార్త :** జంట నగరాల ప్రజలకు దశాబ్దాలుగా తాగునీటిని అందిస్తున్న గండిపేట్ జలాశయాన్ని కలుషితం చేసే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో మాటలు చెబుతున్న ప్రభుత్వం, ఆచరణలో మాత్రం చెరువులు, ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలను నాశనం చేస్తోందని ఆరోపించారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో గండిపేట్ చెరువుకు ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 151లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో నిజాం పాలకులు హైదరాబాద్ నగర భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉస్మాన్ సాగర్ (గండిపేట్), హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించారని గుర్తు చేశారు. ఆ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వాలు వాటి పరిసర ప్రాంతాలను రక్షి త మండలాలుగా అభివృద్ధి చేశాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమ యంలో గ్రామాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన పేరుతో పేద ప్రజల ఇళ్లను కూల్చి వేస్తూ, మరోవైపు ప్రజల ఆరోగ్యానికి ప్రమా దకరంగా మారే డంపింగ్ యార్డులను మంచినీటి వనరుల సమీపంలో ఏర్పాటు చేయడం దారుణమన్నారు. గండిపేట్ చెరువుకు ఆనుకొని ఉన్న ప్రాంతంలో మున్సిపాలిటీల చెత్తను తరలించి డంపింగ్ యార్డ్‌గా మార్చడం ద్వారా జలాశయం కాలుష్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలంలో చెత్త నుండి వచ్చే మురుగు నీరు చెరువులో కలిసే అవకాశం ఉండటంతో తాగునీటి నాణ్యత దెబ్బతింటుందని హెచ్చరించారు. జంట జలాశయాలు కలుషితం కాకుండా ఉండేందుకే గత ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని ట్రిపుల్ వన్ జీ ఓ (బీవీ111) పరిధిలో ఉంచాయని గుర్తు చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, భవిష్యత్ తరాల సంక్షేమం కంటే ప్రభుత్వానికి చెత్త నిర్వహణే ముఖ్యమైందా అని ప్రశ్నించారు. గండిపేట్ వంటి కీలక తాగునీటి వనరును రక్షి ంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వెంటనే డంపింగ్ యార్డును అక్కడి నుండి తరలించి ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలు, రైతులు, పర్యావరణ ప్రేమికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌తో ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీధర్, మాజీ సర్పంచ్ మంజుల రవియాదవ్, మాజీ ఎంపీటీసీ మొర శ్రీను, బీఆర్ఎస్ నాయకులు అనంతరెడ్డి, ముదిగొండ రవి యాదవ్, దారెడ్డి వెంకటరెడ్డి, శ్రీహరి యాదవ్, కొత్త నరసింహారెడ్డి, రావుఫ్, మోహన్ రెడ్డి, షాబాద్ మధు, పరమేష్, మోత్కుపల్లి సునీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజులుంపై పోరుబాట

**కేజీ టు పీజీ ఉచిత విద్య హామీలు ఏమయ్యాయి..?**

**బిజెవైఎం నేతల ఆందోళన**



ధర్నాలో పాల్గొన్న బిజెవైఎం నాయకులు

**కొత్తూరు, జూన్ 9, ప్రభాతవార్త:** కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై మోపుతున్న భారీ ఫీజుల భారాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం కొత్తూరు మండలం అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో కొత్తూరు మండలం బీజేవైఎం నాయకులు ధర్నా కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీజేవైఎం కొత్తూరు మండల అధ్యక్షుడు అంబటి శ్రీశైలం మాట్లాడుతూ, గత ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య పేరుతో ప్రజలను మోసం చేసిందని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం కూడా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు విద్య అందకుండా చేసే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన సమయంలో వాటిని మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలు ఉంటే వారిని చదివించడానికి లక్షల్లో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొనిందని, దీంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని అన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని పేర్కొంటూ, విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం సమర్థవంతంగా అమలైతే పేద ప్రజల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని, సమాజంలో ప్రతి ఒక్కరికీ విద్యావకాశాలు కల్పించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జనరల్ సెక్రటరీ ప్రశాంత్, నాయకులు శివ పాల్గొన్నారు.

## నడి రోడ్డుపై ధాన్యం..

# కళ్లల్లో దైన్యం

**కొనుగోళ్లు లేక రైతులు డీలా..**

**వర్షాల భయంతో వణికిపోతున్న కర్షకులు**

**శామీర్‌పేట, జూన్ 9, ప్రభాతవార్త :** ఇటు కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలతో నిండి ఉండటం, అటు రైస్‌మిల్లు కూడ ఒకటే ఉండి అక్కడ కూడ ధాన్యం బస్తాలతో పుల్‌గా ఉండటం, ఇక గోదాము కూడ బస్తాల నిల్వ కోసం ఏర్పాటు చేసినా ధాన్యం బస్తాలతో అదీ కూడ పుల్ కావస్తున్నప్పటికీ శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కేంద్రాల్లో కొనుగోలు నత్తనడకలో నడుస్తున్న పరిస్థితి దాపురించింది. ఇక ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వరిధాన్యం బస్తాలు ట్రాక్టర్లు, వాహనాల్లో తీసుకవచ్చి రోజుల తరబడిగా కొనుగోలు లేక వేచి చూస్తున్న పరిస్థితి ఏర్పడింది. ముందుగా లారీల కొరతతో కొనుగోలు చేసిన వరిబస్తాలను మిల్లుకు తరలించలేని పరిస్థితి ఏర్పడి కొనుగోలు కేంద్రాలు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు అక్కడే ఉండటంతో స్థలం సమస్య ఏర్పడింది. శామీర్‌పేట, అలియాబాద్, జగ్గంగూడ, కేశవరం, మూడుచింతలపల్లి-లక్ష్మాపూర్ కేంద్రాల్లో వరిధాన్యం బస్తాలతో కేంద్రాలు కిక్కిరిసి పోయాయి. ఇక ఉద్దెమర్రిలోనూ అదే పరిస్థితి ఏర్ప డింది. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో ఉన్న ఆయా వరిధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైతుల నుంచి కొనుగోలు చేసి వరిధాన్యంను కేంద్రాల నుంచి కొత్తగా బొమ్మరాసిపేట్‌లోని గోదాముకు ట్రాక్టర్లలో కేంద్రాల నుంచి తరలిస్తున్నారు. బొమ్మరాసిపేట్‌లోని గోదాము కూడ పుల్ కావస్తుందని లోడ్ కాలిచేయటంలోనూ ఆలస్యం అవుతున్న పరిస్థితి ఉన్నట్లు స్పష్టం అవుతుంది. ఈ సారి శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో వరికోతలు ఆలస్యంగా రావటంతో కేంద్రాలను కూడ ఆలస్యంగానే ప్రారంభించారు.

మిగతా 2లో

పొన్నాల్-అద్రాస్‌పల్లి గ్రామాల మధ్య రోడ్డుపై ఆరబోసిన ధాన్యం



రోడ్డుపైనే ధాన్యం చెరుగుతున్న కూలీలు



ధాన్యం బస్తాలతో నిండిపోయిన శామీర్‌పేట కొనుగోలు కేంద్రం



అన్‌లోడింగ్‌కు స్థలం లేక ట్రాక్టర్లలోనే బస్తాలు ఉంచిన దృశ్యం

## ఎరువులతో పాటు మందులు

# అంటగడితే క్రిమినల్ కేసులు

**వ్యాపారులకు కలెక్టర్ దీపక్ తివారీ హెచ్చరిక**

**ధారూర్, జూన్ 9, ప్రభాతవార్త:** ఎరువులతో పాటు ఇతర మందులను అంటగడితే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి హెచ్చరించారు. మంగళవారం ధారూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్లు, మన గ్రోమోర్ కేంద్రం, వడ్ల కొనుగోలు కేంద్రంతో పాటు మున్నూరు సోమారంలోని జొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మన గ్రోమోర్ కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా ఎరువులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా, రైతులకు డీఏపీ ఇచ్చే సమయంలో ఇతర అనవసరపు మందులు కూడా కొనాలంటూ లింకు పెడితే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామని అక్కడే ఉన్న పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. వెంటనే డీఏపీని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన, వడ్ల కొనుగోలులో ఏమాత్రం జాప్యం చేయరాదని, తూకం పూర్తయిన ధాన్యపు బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అధికారులకు కరాఖండిగా చెప్పారు.



మన గ్రోమోర్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

**కలెక్టర్ దృష్టికి విద్యుత్ సమస్య**

ధారూర్ మండల కేంద్రంలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని, గంటల తరబడి కరెంట్ రావడం లేదని స్థానికులు కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు కూడా ఆన్/ఆఫ్ స్విచ్‌లు లేవని వివరించారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్, విద్యుత్ శాఖ ఏఈ వేణుగోపాల్ రెడ్డిని పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, నిధులు లేదా ఇతర సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం, తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింలు, సీఈఓ నర్సింలు, రవి, ఏఈవో సంజీవ్ రాథోడ్, సంతోష్, స్థానిక డీసీసీ కార్యదర్శి బాబా ఖాన్, అమర్ పటేల్, యూనస్, పలువురు రైతులు, స్థానికులు పాల్గొన్నారు.



వీరన్నపేట సబ్‌స్టేషన్‌లో బోరుమోటరును అందజేస్తున్న సర్పంచ్‌లు

## బోరు మోటారు అందజేసిన సర్పంచ్‌లు

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 9,(ప్రభాతవార్త):** జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలో వీరన్న పేట 33/11 కేవి సబ్ స్టేషన్ లో బోరు మోటాంను మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు బోరు మోటరును అందజేశారు. మంగళవారం సబ్‌స్టేషన్ లో ఎఇ నర్సింహులుకు సర్పంచ్‌లు బోరు మోటరును అందజేశారు. అనంతరం బోరులో మోటరును బిగించారు. ఈ సందర్భంగా ఏఈ సర్పంచ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మోటరు లేక నీటి కోసం ఇబ్బందులు పడినట్లు ఆయన తెలిపారు. అడిగిన వెంటనే స్పందించి బోరు మోటరు ఇప్పించినందకు సర్పంచ్‌లు ధర్మ్యాతండా చందు నాయక్, వాచ్చ తండా రవి నాయక్, ముష్టిపల్లి జంగయ్య, చెగిరెడ్డి ఘనపూర్ పావని శివమోళి, చింతకుంట తండా దేవి రామ్ చరణ్, పెద్ద ఎల్కిచర్ల సోనీ శేఖర్, వీరన్న పేట సుమలత వెంకట్ రాములు, గాలి గూడెం స్వప్న సత్యంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసే పార్టీలోకి వలసలు



కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న రుక్మాపూర్ సర్పంచ్

**పెద్దేముల్, జూన్ 9, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసే పార్టీలోకి వలసలు ప్రారంభమైనట్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, మండలపార్టీ అధ్యక్షులు రుద్రారం మహిపాల్‌రెడ్డి అధ్వ ర్యంలో, ఎమ్మెల్యే సమక్షంలో పెద్దేముల్ మండలం రుక్మాపూర్ సర్పంచ్ చెరుకుపల్లి బాల్‌రాజ్ తదితరులు బిఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ సిద్దాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసంక్షేమ పథకాలపై విశ్వాసం ఉంచి బిఆర్‌ఎస్ నాయకులు పార్టీలో చేరడం సంతోషకరమని అన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అందరు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల, ఇతర ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయానికి ఈ చేరికలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, శోభారాణి, కోటపల్లి మార్కెట్ కమిటి వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, రాంగోపాల్,టి,చంద్రప్ప, ఓంలానాయక్‌తాండా సర్పంచ్ సుమిత్ర రాథోడ్, యువనాయకులు సాయిని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా పనిచేయాలి

**మాజీ మంత్రి సబితా రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా రెడ్డి

**పరిగి, జూన్ 9, ప్రభాతవార్త:**

బిఆర్‌ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ పిలుపు మేరకు పార్టీ సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ,వికారాబాద్ జిల్లా, పరిగి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమన్వయ సమావేశంలో సబిత పాల్గొన్నారు.. పరిగి నియోజకవర్గంలో భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వనమోదు కార్యక్రమానికి సంబంధించిన పలు సూచనలు ,సలహాలను నాయకులకు వివరించారు. మాజీ మంత్రి సబిత మాట్లాడుతూ .. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని , పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్‌లు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ మ్యాపింగ్‌లో ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు .సభ్యత్వ నమోదు ప్రక్రియ డిజిటల్ రూపంలో నమోదు చేయాల్సి ఉంటుందని , దీనిపై పార్టీ ఇంచార్జ్‌లతో సమన్వయం కావాలన్నారు. కెసిఆర్ ఆదేశాలతో, మార్గదర్శకాలను పాటిస్తూ, సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని సబితా ఇంద్రారెడ్డి నాయకులకు తెలిపారు.

బూత్ లెవెల్ స్థాయి నుంచి మండల పార్టీ వరకు సభ్యత్వ నమోదుకు క్రియాశీలకంగా వ్యవహరించాలని , బిఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.. పరిగిలో బిఆర్‌ఎస్ నాయకులు ప్రజలకు,రైతులకు మద్దతుగా నిలుస్తున్నారని,ఇదే పోరాటాన్ని కొనసాగించి ప్రజలకు అండగా నిలవాలని నాయకులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, మాజీ జిల్లా పార్టీ అధ్యక్షులు మెతుకు ఆనంద్, పార్టీ ఇంచార్జీ శ్రీనివాస్ రావు, పార్టీ మండలాల అద్యక్షులు, నాయకులు పాల్గొన్నారు....

## మున్సిపల్ ఆస్తిని కాపాడండి .!

**-- కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన బిజెపి కౌన్సిలర్లు**

**తాండూరు, జూన్ 9, ప్రభాతవార్త :** ఆక్రమణకు గురవుతున్న మున్సిపల్ ఆస్తులను కాపాడాలని బిజెపి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ నాగారం మల్లేశం, కౌన్సిలర్ శ్రీకాంత్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

తాండూరు మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ, సర్వే నెంబర్ 52లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందని తెలిపారు. సర్వే నెంబర్ 52లోని ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఎలాంటి యాజమాన్య హక్కు లేకుండా.. భూమిని ఆక్రమించి ప్రహరి నిర్మించాలని ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వ భూమిని కాపాడి.. ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నీటి గుంటలో పడి వ్యక్తి మృతి

**శంకర్‌పల్లి, జూన్ 9, ప్రభాతవార్త :** నీటి గుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నంతవరం గ్రామం, బల్మూర్, మండలం నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన అశోక్ (25) మోకీలలోని ఎస్.ఎస్.ఐ కన్స్ర్టక్షన్ నందు లేబర్‌గా పనిచేస్తున్నాడు.

అశోక్ తాను పనిచేస్తున్న ప్రదేశంలో ప్రమాదవశాత్తూ గుంటలో పడి చనిపోయాడు. మృతుని తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

**ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కడ్తాల్, జూన్ 9, ప్రభత వార్త :** నేడు జరగబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మీర్ ఖాన్ పేటలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కార్యాలయ భవన ప్రారంభోత్సవ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా జరుగనున్న కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధి దిశగా కీలక నిర్ణయం అని, ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధికి నాంది పలుకుతుందని అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజాప్రతితులు నాయకులు మహిళలు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ గుడురు భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, డిసిసి అధికార



ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, మండల పార్టీ అధ్యక్షులు బిచ్చ నాయక్, ఏఎంసి డైరెక్టర్ చేగురి వెంకటేష్ టౌన్ అధ్యక్షులు మాలే మల్లేష్, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మయ్య, జాంగిర్ బాబా, జాంగిర్ అలీ, చందోజీ, భాను, కిరణ్, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**వికారాబాద్, ప్రభాతవార్త :** రైతులు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ మార్కెట్ యార్డ్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత మొదటి సారి జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. క్వింటాలు జొన్నలకు గాను



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్

రూ.3,699 మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్లో మంచి ధరకు పంటను విక్రయించాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్‌లు రమేష్ నాయక్, పాపిరెడ్డి, పాండురంగరెడ్డి, ప్రభాకర్, విజేందర్ రెడ్డి, డీసీఎంఎస్ మేనేజర్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణలో బిఎల్‌ఎల పాత్ర కీలకం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 9, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అధ్వ ర్యంలో తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్‌పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు(బిఎల్‌ఏ)ల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్ రాష్ట్ర కన్వీనర్ పరిగిఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, టిపిసిసి నియమించిన ప్రత్యేక ట్రైనర్ వెంకటరమణ, నియోజక కన్వీనర్ పురుషోత్తంరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజాబాల్‌రెడ్డి, సర్ విదివిధానాలు, ఓటరు జాబితా, సవరణ ప్రక్రియ, బిఎల్‌ఏ బాధ్యతలు, చేపట్టాల్సిన కార్యచరణపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఓటుహక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణధారమని, సర్ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ముప్పు అని అన్నారు. 1951 నుంచి 2004 వరకు దాదాపు 8 సార్లు ఓటర్ విశ్లేషణ జరిగిందని, కాని ఈ సారి జరిగినట్టుగా ఎప్పుడు జరగలేదని అన్నారు. బిజెపి ప్రభుత్వం చెబుతున్నట్లు సర్ ప్రక్రియ అనేది ప్రజాస్వామ్యం బలపడేట్లు జరగడం లేదని అన్నారు. ఈ సారి జరిగే సర్ ప్రక్రియ బిజెపి ప్రభుత్వం కనుసైగలోప్రజాస్వామ్యానికి ముప్పు తెచ్చే విధంగా కొనసాగుతుందని అన్నారు. ఇప్పటికే సర్ ప్రక్రియ జరిగిన బీహర్, పశ్చిమబెంగాల్‌తో పాటు పలు రాష్ట్రాలను గమనిస్తే అక్కడ




మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిఎంఆర్



హాజరైన ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు

నకిలి ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం పక్కన పెడితే బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించడం పనిగా పెట్టుకుందని విమర్శించారు. రాజ్యాంగ బద్దంగా కేంద్రం ఎన్నికల సంఘం పరివేక్షణలో జరిగే సర్ ప్రక్రియ బిజెపి కనుసైగలో జరుగుతుందని, కావుల మీరంత(బిఎల్‌లు) అడ్డుకట్టవేయడానికి సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ నెల రోజుల వ్యవధి అనేది మనకు చాల ముఖ్యమైందని, ఈ సమయంలో పార్టీ తరపున నియమించిన బిఎల్‌ఏలు వారితో కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నేర్చుకున్న ప్రతి అంశం మీరు ఓటర్లకు తెలియపర్చవలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. సర్ ప్రక్రియలో బిఎల్‌ఏలు కేవలం ఫోటోలకు పరిమితం కాకుండా పనిలో నిమగ్నం అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 269 బూత్‌ల బిఎల్‌ఏలు,మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, మునిసిపల్, మార్కెట్ కమిటి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ బాధితులకు రూ.1.37కోట్ల పరిహారం పంపిణీ

**మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్**

**కొడంగల్,జూన్ 9,ప్రభాతవార్త:** కొడంగల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.కొడంగల్ పట్టణాభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణలో ఇళ్ళు కోల్పోతున్న బాధితులకు మంగళవారం పరిహారం చెక్కులను పంపిణీ చేశారు.స్దానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మేన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని,రాష్ట్రంలోనే కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వెల్లడించారు.సిఎం చొరవతో పాటు కాంగ్రేస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి ప్రత్యేక చొరవతో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతు న్నాయని తెలిపారు.పట్టణాభివృద్ధి చెందాలంటే ప్రజలు, వ్యాపారవేత్తలు,భూయజమానులు సహకరించాలని కోరారు.ప్రజల సహకారంతోనే పటణాన్ని ఆధునికంగా మార్చడం సాధ్యమవుతుందని అన్నారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని,అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి చేరేలా



బాధితులకు చెక్కులను అందజేస్తున్న మున్సిపల్ చైర్మెన్

చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.మహబూబ్‌నగర్,చించోళీ రహదారి విస్తరణ ప్రాజెక్టులో భాగంగా ఇళ్ళు,స్దలాలు కోల్పోయిన 58 మంది లబ్దిదారులకు రూ.1,37,55,105 పరిహారాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు . రహదారి విస్తరణలో భూసేకరణ ప్రక్రియలో నిబంధనల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.మహబుబ్ నగర్ ,చించోళీ రహదారి విస్తరణతో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని అన్నారు.ఈ రహదారి ద్వారా ప్రాంతీయ అనుసంధానం కావడంతో వాణిజ్య,వ్యాపార, పారిశ్రామిక రంగాలకు కూడా ఉతం లభిస్తుందన్నారు. రహదారి విస్తరణతో కొడంగల్ పట్టణ రూపురేఖలు మారడవంతో పాటు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మేన్ శంకర్‌నాయక్,తహశీల్దార్ రాంబాబు, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్, మున్సిపల్ కౌన్సిలర్‌లు సయ్యద్ హమీద్, బత్తుల అనితనర్సింహ,కుశగారి రాజశేఖర్,సుష్మదాము ,మున్సిపల్ కోఅప్షన్ సభ్యులు రమేష బాబులతో పాటు కాంగ్రేస్ నాయకులు సోమశేఖర్,రాము,సయ్యద్ అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన

**కొడంగల్,జూన్ 9,ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రిని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యుసుఫ్‌లు పరిశీలించారు.మంగళవారం ఆసుపత్రిలో జరుగుతున్న పనులను పరిశీలించారు.అనంతరం ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించి ఆసుపత్రికి నిత్యం వచ్చే రోగుల వివరాలను ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సాకేత్‌ను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.అలాగే యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులను పూర్తి చేసి త్వరలోనే ప్రారంబించేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు,కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ పనులను మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్,కౌన్సిలర్‌లతో కలిసి పరిశీలించారు.త్వరితగతిన పనుల పూర్తితో అన్ని హంగులతో



ఆసుపత్రిలో వైద్య సేవలపై వాకబు చేస్తున్న కడా ప్రత్యేక అధికారి,మున్సిపల్ చైర్మేన్

త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

## మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత కొరకు 120 సిసిటివి కెమెరాలు

**మోమిన్‌పేట్, జూన్ 9. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భద్రత, నేరనియంత్రణ మరియు సమర్ధ వంతమైన పోలిసింగ్ రొరకు ఏర్పాటు చేసిన 120, సీసీటీవి కెమేరాల పారంభోత్సవానికి పీఎస్ మోమిన్‌పేట యందు ఉదయం 11;30 గంటలకు ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ షానవాజ్ ఖాసీం ఐపిఎస్, మల్టీజోన్-II, హైదరాబాద్. సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ వికారాబాద్ జిల్లా స్నేహామెహ్రా ఐపిఎస్‌లు ఇట్టి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఐ భరత్‌భూషణ్.

కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించనున్నట్లు ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు ప్రజల భద్రత, నేరాల నియంత్రణ తదిర విషయాలలో సీసీ కెమేరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఇట్టి బృహత్తరమైన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంధర్భంలో మండలంలోని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఎస్ఐ భరత్‌భూషణ్ కోరారు.



మహిళాసంఘం బస్సును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## మహిళాసంఘం సభ్యుల బస్సు టిఎస్ఆర్‌టిసికి అప్పగింత

**దోమ,జూన్ 9, ప్రభాతవార్త:** మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయుటకు కాంగ్రెస్ ప్రభుత్వంఎంతో కృషి చేస్తుందని దోమ సర్పంచ్ మాలిశివ కుమార్‌రెడ్డి,మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు శాంత్‌కుమార్ అన్నారు.దోమ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యములో బస్సును కొనుగోలు చేసిన సందర్బముగ మంగళవారంనాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బసును టిఎస్ ఆర్‌టిసికి అప్పగించేందుకు బస్సును ప్రారంభోత్సవంచేశారు.మండలములోని అన్ని గ్రామాల మహిళలు తమకు నచ్చిన పనులను ఎంపిక చేసుకొని మహిళా సమాఖ్యద్వారా రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు.మహిళలకు బస్సుకొనుగోలుకు సహకరించినపర్గి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డికి ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమములో ఎపిఎం శోభ,డిప్యూటి తహసిల్దార్‌నర్సిములు,కాంగ్రెస్‌నాయకులు యాదవరెడ్డి,రాఘవేందర్‌రెడ్డి,మహిళలు పాల్గొన్నారు.



దోమలో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న మాజిసర్పంచ్ రాజిరెడ్డి

## విగ్రహం ఏర్పాటు కోసం వాల్‌పోస్టర్ విడుదల

**దోమ,జూన్ 9, ప్రభాతవార్త:** రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి అందరూ హాజరుకావాలని దోమ మండల సర్పంచుల సంఘం మాజి అధ్యక్షులు కె.రాజిరెడ్డి అన్నారు.మంగళవారం నాడు దోమ మండల కేంద్రములోని అంబేద్కర్ విగ్రహం దగ్గర వాల్‌పోస్టర్ విడుదల చేశారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ దేశానికి సమానత్వం స్వేచ్ఛ సౌభ్రాతృత్వం కలిగిన రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన అంబేద్కర్ ఆయన విగ్రహం ఏర్పాటులో అందరూ పాల్గొనాలని సూచించారు.అంబేద్కర్ ఒక్కరికి కాకుండా అందరివాడుగా భావించాలని పేర్కొన్నారు.ఈ నెల 13న పూడుర్ మండలము మాటుగూడెం గ్రామములో ఏర్పాటు చేయబోతున్న విగ్రహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమములో అంబేద్కర్ సంఘం నాయకులు మంచన్‌పల్లి శ్రీనివాస్,రాములు, ఆంజనేయులు,దప్పురమేశ్,నర్సిములు,బద్రి,విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు ఎంపి పర్యటన

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 9,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలలో బుదవారం పాలమురు ఎంపి డికె అరుణ పర్యటించనున్నట్లు బిజెపి మండల అధ్యక్షుడు ఎదిర రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రావిర్యాల బిడ్జి, గుర్రంపల్లి గ్రామంలో హైమాక్సు లైట్ల ప్రారంబోత్సవం, లక్ష్మిదేవిపల్లి ప్రాజెక్టు స్థల పరిశీలన చేయనున్నట్లు ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బిజెపి కార్యకర్తలు, నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మహబూబ్‌నగర్ ఎంపి డీకే అరుణ నేడు షాద్‌నగర్ నియోజకవర్గంలో విస్తృత పర్యటన

**షాద్‌నగర్, జూన్ 9, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ బుధవారం (జూన్ 10) కొందుర్గు మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమె పర్యటన షెడ్యూల్ విడుదలైంది. ఉదయం 10 గంటలకు షాద్ నగర్ జానంపేట గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయ కార్యక్రమంలో పాల్గొననున్న ఎంపీ, అనంతరం ఉత్తరాశిపల్లిలో పార్టీ చేరికల కార్యక్రమానికి హాజరవుతారు. తర్వాత రేగడి చిలుకమర్రి, చిన్న ఉమ్మెంత్యాల, కొందూర్, గుర్రంపల్లి గ్రామాల్లో హైమాస్ట్ లైట్లను ప్రారంభించనున్నారు. కొందూర్‌లో స్థానిక నాయకులతో సమావేశమై ప్రెస్‌మీట్ నిర్వహించనున్నారు.మధ్యాహ్నం జిల్లేడ్‌లో భోజన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని పరిశీలించనున్నారు. సాయంత్రం 5 గంటలకు రవిర్యాల వంతెనను సందర్శించి పరిశీలన చేపట్టనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు.



జితేందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## త్వరగా కోలుకొని ప్రజాసేవలో పాల్గొనాలి

**పెద్దేముల్, జూన్ 9, ప్రభాతవార్త:** తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఉపాధ్యాక్షులు జితేందర్‌రెడ్డి త్వరగా కోలుకొని ప్రజాసేవలో పాల్గొనాలని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పెద్దేముల్ గ్రామానికి చెందిన జితేందర్‌రెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్తితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, కాంగ్రెస్‌పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, జిల్లా ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి, శోభారాణి, మండలపార్టీ అధ్యక్షులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, కోటపల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, విజయబాస్కర్‌రెడ్డి మాజీ యంపిటిసి విద్యాసాగర్, ఓంలనాయక్‌తాండా సర్పంచ్ సుమిత్ర రాథోడ్, గ్రామ కమిటి అధ్యక్షులు డివై నర్సిములు తదితరులు ఉన్నారు.

## సాయిబాబా కాలనీ సమస్యలతో సతమతం

**పరిష్కారం కోసం కమిషనర్ గడప తట్టిన ప్రజలు**

**షాద్‌నగర్, జూన్ 9, ప్రభాతవార్త :** సాయిబాబా కాలనీ (బాబా నగర్) ఫేస్ 2 లో నెలకున్న అనేక సమస్యలపై మునిసిపల్‌కు కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో తాత్కాలికంగా ఉన్న విద్యుత్ శాశ్వత పరిష్కారం అందించాలని, విద్యుత్ ట్రాన్ఫార్మర్‌ను నూతనంగా ఏర్పాటు చేయాలని, కాలనీ కి వచ్చే ముఖ్యమైన రోడ్‌ను వెడల్పు చేసి అడ్డంకులు తొలగించాలని, కాలనీ మొదట్లో పాత హైవేపై ఉన్న హైమాస్ట్ లైట్‌ను తొలగించాలని కోరారు. అలానే అక్రమ నిర్మాణాలను కూడా తొలగించాలని , మురుగు కాలువలు మరియు రోడ్లు నిర్మించాలని కోరారు. కాలనీలో ఉన్న 10 శాతం ప్రభుత్వ భూమిలో పార్కు నిర్మాణం చేపట్టాలని, మిగిలిన దానిలో చెట్లు పెట్టి స్థలాన్ని కాపాడాలని కోరారు. ప్రస్తుతం రాబోతున్న వర్షాకాలంలో కనీసం రోడ్ల పై మట్టి అయినా పోసి నడవటానికి వెసులబాటు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ శివ ఎస్పీ, కాలనీ వాసులు పినపాక ప్రభాకర్, సాంబశివ రావు (శివ), డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబా కాలనీ సమస్యలను కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం



## మొయినాబాద్ ఫామ్ హౌస్ కేసు
## ఇప్పటికే మిస్టరీగానే మిగిలింది

**సత్వర నయం చేయకపోతే రోడ్డుపై బైటాయిస్థమన్న కుటుంబీకులు**

**చేవెళ్ల, జూన్ 9, ప్రభాతవార్త :** గత నెల 17 అర్ధరాత్రి కనకమామిడిలో వ్యాస్ అనే వ్యక్తి ఫామ్ హౌస్‌లో మసీదు బండకు చెందిన కొందరు వ్యక్తులు బర్తడే వేడుకలు చేసుకోవడం జరిగింది, ఆ పార్టీకి వచ్చిన వ్యక్తులలో కోడిచెర్ల సాయి కుమార్ అనే వ్యక్తి అనుమాస్పదంగా మృతి చెందడం జరిగింది. అయితే ఆరోజు ఆ ఫామ్ హౌస్‌లో కనీసం సిసి కెమెరాలు లేకపోవడం, ఎలా చని పోయాడు అనేది ఇప్పటికీ ఒక మిస్టరీగానే మిగిలింది, సంఘటన జరిగి 20 రోజులు గడుస్తున్న ఇప్పటికి ఒకర్ని కూడా అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది, వెంటనే నిందితులను అరెస్టు చేసి బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని ఎసిపి ని కలిసి విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు నరేందర్ మాదిగ,రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివ శంకర్ మాదిగ,చేవెళ్ల మండల అధ్యక్షులు ఊరెంట ప్రవీణ్ మాదిగశేర్లింగంపల్లి అధ్యక్షులు నరేష్ మాదిగ, ప్రేమ్ కుమార్ మాదిగ,నగేష్ మాదిగ, రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు



## పుష్పగిరి ఫౌండేషన్ టీం ఆధ్వర్యంలో
## ఉచిత కంటి వైద్య శిబిరం

**చేవెళ్ల, జూన్ 9, ప్రభాతవార్త :** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో పుష్పగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కౌన్సలర్ మాధవి యాదిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగింది ఈసందర్భంగా కోర్డినేటర్ త్రివేణి మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్య పరీక్షలు ఉంటాయని పేదలు వేలు ఖర్చు చేసుకునే వైద్య పరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందని అన్నారు . అనుభవజ్ఞులై వైద్యులు శిబిరం లో హాజరై క్యాటరక్ట్, కంటికి సంభందించిన అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసి. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి సంబంధిత వైద్య సేవలు అందిం చాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది,ఈసందర్భంగా మల్కాపూర్ కౌన్సిలర్ మాదవి యాదిరెడ్డి మాట్లాడుతూఈ శిబిరంలో గ్రామానికి చెందిన వృద్ధులు, కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు, మహిళలు, ఇతర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికి కంటి ఆరోగ్యంపై పరీక్షలు నిర్వహించి, సమస్యలను గుర్తించి తగిన సూచనలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది కంటి సమస్యలను నిరక్ష్యం చేయడం వల్ల భవిష్యత్తులో పెద్ద సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు సూచించారు. ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు. ఈ ఉచిత శిబిరం ద్వారా గ్రామస్తులకు వైద్య సేవలు అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న గ్రామీణ ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామస్థాయిలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరురారు .ఈకార్యక్రమంలో పుష్పగిరి ఫౌండేషన్, సిబ్బంది త్రివేణి, యశ్వంత్ శివ, బాబు తదితరులు పాల్గొన్నారు



## హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**షాద్‌నగర్, జూన్ 9, ప్రభాతవార్త :** షాద్ నగర్ నియోజక వర్గంలోని ఫరూక్ నగర్ మండలం కమ్మదానం గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను నిన్న సోమవారం రాత్రి ప్రజాప్రతినిధుల మరియు గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా ప్రారంభించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హైమాస్ట్ లైట్లు ఏర్పాటువల్ల గ్రామంలో భద్రత పెరగడంతో పాటు రాత్రి సమయంలో ప్రజల రాకపోకలకు సౌలభ్యం కలుగుతుందని అన్నారు. తమ గ్రామానికి ఉపయోగపడే ప్రజాప్రయోజన కార్యక్రమాన్ని సొంత నిధులతో అమలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి గ్రామస్తులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మధానం సర్పంచ్ గోదుల లత కిరణ్ కుమార్ గౌడ్, ఉపసర్పంచ్ పెద్దింటి జగన్నాథ్, కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్, పోమాలపల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, లింగం దాన సర్పంచ్ నాగిళ్ల వెంకటేష్, మెల్లగూడ సర్పంచ్ మంగారవి నాయక్, మాజీ సర్పంచులు నర్సిములు, చక్కటి వెంకటేష్ యాదవ్, తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి, శేఖర్ పంతులు, యారం శేఖర్ రెడ్డి, కమ్మదానం గ్రామకమిటి అధ్యక్షులు శివగాళ్ల రాజు, వార్డు మెంబెర్స్ గులాబ్ శ్రీను, గడ్డమీది లక్ష్మి చెన్నయ్య గౌడ్, సిరిగిరి కవితవెంకటేష్ గౌడ్, జోగామ్మాగూడం బిఆర్ఎస్ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పర్సాపూర్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

**కొడంగల్, జూన్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి గ్రామంలోని పలు కాలనీల్లో గత కొంతకాలంగా మట్టితో పేరుకు పోయిన మురుగుకాల్వలను సర్పంచ్ కన్నం రాధశ్రీనివాస్‌రెడ్డి జేసీబీ సహాయంతో తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా మురుగుకాల్వల పరిశుభ్రత, తాగునీటి సరఫరా విద్యుత్ తదితర అంశాలపై ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధితో పాటు ఆదర్శ గ్రామంలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



జేసీబీ సహాయంతో మురుగుకాల్వలో మట్టిని తొలగిస్తున్న దృశ్యం

# మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రంగారెడ్డి అర్బన్ జూన్9, ప్రభాతవార్త :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం శంషాబాద్‌లో మహిళా సంఘానికి చెందిన ఆర్టీసీ అద్దె బస్సును ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించి, బస్సుల కొనుగోలుకు మద్దతు ఇవ్వడం ద్వారా వారికి శాశ్వత ఉపాధి లభిస్తుందని అన్నారు. మహిళా సాధికారతకు ఈ పథకం ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని కొనియాడారు. మహిళా సంఘాల ద్వారా బస్సులు నడపడం వల్ల అటు ఆర్టీసీలో బస్సుల కొరత తీరడంతో పాటు, ఇటు మహిళలకు నిరంతర ఆదాయం లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి



సాతంరాయి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యాధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు

**-రంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు**

**రంగారెడ్డి అర్బన్ జూన్9, ప్రభాతవార్త :** పిల్లలను పాఠశాలలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పలువురు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. మంగళవారం శంషాబాద్ మండలం సాతంరాయి గ్రామంలో బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడడమే లక్ష్యంగా అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపి వారి భవిష్యత్తును మెరుగుపరచాలని పిలుపు నిచ్చారు. విద్య అనేది సమాజ అభివృద్ధికి పునాదని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో బడి ఈడు పిల్లలు అందరూ బడిలో చేరేవిధంగా తగు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని ,అందరికీ అందుబాటులో విద్యానందించాలని అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ ,స్థానిక కాంప్లెక్స్ ప్రధానోపాయులు కిష్టారెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, వెంకటయ్య ,సువర్ణ మరియు ఉపాధ్యాయులు ,గ్రామస్తులు పాల్గొన్నారు .

# నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్

**షాద్‌నగర్, జూన్ 9, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.587 కోట్ల నిధులను కేటాయించడం శుభపరిణామమని షాద్‌నగర్ తాలూకా జేఏసీ చైర్మన్ మూలే జనార్ధన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అని తెలిపారు. ప్రాజెక్టు సాధన కోసం ఎన్నో సంవత్సరాలుగా ఉద్యమాలు, వినతిపత్రాలు, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహించి నప్పటికీ ఆశించిన పురోగతి కనిపించలేదన్నారు. అయితే



మాట్లాడుతున్న జెఏసి నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సాధన కోసం నిరంతరం కృషి చేయడంతో భూసేకరణకు రూ.587 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ప్రాజెక్టు భూసేకరణకు నిధులు కేటాయించడం ద్వారా షాద్‌నగర్ ప్రాంత ప్రజల ఆశలకు కొత్త ఊపిరి లభించిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు షాద్‌నగర్ తాలూకా జేఏసీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ తాలూకా జేఏసీ చైర్మన్ మూలే జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, జేఏసీ కన్వీనర్ నక్క బాల్‌రాజ్ యాదవ్, తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం తాలూకా కోఆర్డినేటర్ జాంగారి రవి, జేఏసీ ట్రెజరర్ గోర్ల రాము, ఉద్యమకారుడు మల్లేష్ తదితరులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# హరికృష్ణ ముదిరాజ్‌ది ముమ్మాటికి హత్యే



**-- నిందితులను కాపాడే పనిలో పోలీసులు**

**బషీరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:** ఓ యువకుడి మృతి పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదుపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజా సంఘల నాయకులు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే బషీరాబాద్ మండల పరిధిలోని జీవన్గి గ్రామానికి చెందిన తలారి హరికృష్ణది ముమ్మాటికి హత్యే అని నిందితులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని ముదిరాజ్, దళిత, మైనార్టీ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. తాండూర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రజాసంఘల నాయ కులు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల అండదండలతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని ఆరోపించారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పోలీసులు సరె నరీతిలో అధారాలు సేకరించటంలో విఫలమ య్యారని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమపోరాటం కొనసాగి స్తామని నాయకులు స్పష్టం చేశారు. నిందితులను తప్పించే ప్రయాత్నం చేస్తే 11వ తేదీన తాండూర్ ఆర్డిఓ కార్యాలయం ముందు ప్రజాసంఘల ఆధ్వర్యంలో ధర్నాజయప్రదం చేయాలని ప్రజాసంఘాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం రమేష్ ముదిరాజ్, సిఐటియూ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, టిఎస్‌యంఎస్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహబ్ తదితరులు ఉన్నారు.

**కుటుంబ సభ్యులు:-** జీవన్గి గ్రామానికి చెందిన హరికృష్ణ మే29 వ తేదిన పని నిమిత్తం కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి వెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా అదే రోజు మధ్యాహ్నం అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ జాము రవి

శామీర్‌పేట, జూన్ 9, ప్రభాతవార్త

వన మహోత్సవ దినోత్సవాన్ని పురస్కరించు కుని మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి మొక్కలు నాటారు. మంగళ వారం మూడుచింతలపల్లి మున్సిపల్ కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో చైర్మన్‌తో పాటు కమిషనర్, వైస్‌చైర్మన్, పలువురు కౌన్సిలర్లు మొక్కలను నాటారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటాలని, వాటిని బాధ్యతగా సంరక్షించాలని, భవిషత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, వైస్‌చైర్మన్ ఎం.శశిరేఖ, కౌన్సిలర్లు పెద్దిరెడ్డి లత, రాజిగళ్ల లత, గొంది శ్రీవాణి, మూడవత్ నీవన్, ముద్దం పాపిరెడ్డి, ఎం.గోవర్దన్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, మంద స్వామి, భస్వారెడ్డి, నర్సింలు, మున్సిపల్ అధికారులు డిఈ స్పూర్తి, మేనేజర్ ఉషా, మోహన్‌సింగ్, మల్లిఖార్జున్, బిల్‌కలెక్టర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

**..డిఇఓకు వినతిపత్రం అందజేసిన..టియుడబ్ల్యుజె నాయకులు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 9, ప్రభాతవార్త:** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె-ఐజేయు) మేడ్చల్ జిల్లా శాఖ నాయకులు కోరారు.

మంగళవారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా డిఇఓ రేణుకాదేవిని కార్యాలయంలో మేడ్చల్ జిల్లా టియుడబ్ల్యుజె కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలిసి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. 2026–2027విద్యా సంవత్సరంనకు సంబంధించి జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇచ్చేలా చూడాలని డిఇఓను వారు కోరారు. దీనిపై డిఇఓ రేణుకాదేవి సానుకూలంగ స్పందించి వెంటనే తగు ఉత్తర్వులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.

అదే విధంగా ఎవరైనా జర్నలిస్టులు తమ పిల్లలకు ఫీజు రాయితీ కోరుతూ ఆయా పాఠశాల పేరు మీద వ్యక్తిగతంగ లెటర్ కావాలని అనుకునే వారు నేరుగా జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా విద్యా అధికారి కార్యాలయంలో సంప్రదించాలని డిఇఓ రేణుకాదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఓను కలిసిన వారిలో టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుల గడ్డమీది బాల్‌రాజ్, జిల్లా కార్యదర్శి దొంతుల వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రవిచందర్, జర్నలిస్టులు రామారావు, ప్రసాద్, భూపాల్, నరోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన టాస్క్ పోర్స్ బృందం

**మోమిన్‌పేట్, జూన్ 9. ప్రభాతవార్త:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని మండల టాస్క్ పోర్స్ అధికారులు, మోమిన్‌పేటన తహిశీల్దారు రవిందరన పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ఫర్టిలైజరన దుకాణాలను అకస్మికంగా తనిఖి నిర్వహించారు.

ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. ఫర్టిలైజర్ షాపు యజమానులు నాణ్యతలేని విత్తనాలు గాని, ఎరువులు విక్రయించిన చట్టరిత్యా శిక్షార్హులౌతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాదికారి రామకృష్ణారెడ్డి, పోలీస్ ఇన్స్‌పెక్టర్ భరతన భూషణ్, జిపిఓ శ్రీవాస్ రెడ్డి, షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు.



కాలనీలో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్

## వర్షాకాలానికి ముందస్తు చర్యలు

**షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**

**షాద్‌నగర్, జూన్ 9, ప్రభాతవార్త :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని షాద్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో వర్షపు నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వర్షాల సమయంలో నీటి నిల్వల వల్ల రాకపోకలకు ఆటంకం కలగకుండా అన్ని వార్డుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నరేష్, జీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టేకుల్‌కోడ్‌లో నూతన బోరు ఏర్పాటు

**కొడంగల్, జూన్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని టేకుల్‌కోడ్‌లో నూతన బోరు ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ చెట్టుకింది రాజు తెలిపారు. గ్రామంలోని బిసీ కాలనీలో గతకొంతకాలంగా తాగునీటి ఎద్దడి ఏర్పడిన క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రేస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ సహకారంతో మంగళవారం నూతన బోరు వేయించడం జరిగిందన్నారు. దీంతో బిసి కాలనీలో తాగునీటి సమస్య తీరనుందని సర్పంచ్ తెలిపారు.

## భార్య అదృశ్యం మిస్సింగ్ కేసు నమోదు

**జవహర్ నగర్, జూన్ 9, ప్రభాత వార్త:** జవహర్ నగర్, పోలీస్ స్టేషన్ పరిధిలోనియాప్రాల్ ప్రాంతానికి చెందిన ఆదేశ్ చెట్టారి (30) తన భార్య ఆయేషా రాయ్ (25) కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరిద్దరూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందినవారు కాగా, గత కొంతకాలంగా యాప్రాల్‌లో అద్దె ఇంట్లో నివసిస్తూ ఉపాధి పొందు తున్నారు. ఫిర్యాదు ప్రకారం, ఈ నెల 1వ తేదీన ఆదేశ్ చెట్టారి పనిమీద బయ టకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి ఉండటంతో పాటు భార్య ఆయేషా రాయ్ కనిపించలేదు. ఆమెకు పలుమార్లు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. అనంతరం పశ్చిమ బెంగాల్‌లోని బంధువులను సంప్రదించగా, అక్కడకు కూడా ఆమె రాలేదని సమాచారం అందింది. దీంతో ఆదేశ్ చెట్టారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.





మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ స్రవంతి

## ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌కు పదేళ్లు

**ప్రతి నెల 9వ తేదీన ఉచిత పరీక్షలు, ప్రత్యేక సేవలు: డాక్టర్ స్రవంతి**

**షాద్‌నగర్, జూన్ 9, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అందించే ఉచిత వైద్య సేవలపై వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ, ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ద్వారా గర్భిణీలకు అన్ని రకాల పరీక్షలు, వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. హైరిస్క్ గర్భిణీల ప్రత్యేక పర్యవేక్షణ, సురక్షిత ప్రసవం కోసం ఫాలోఅప్ సేవలు, 102 అంబులెన్స్ ద్వారా ఉచిత రవాణా, సమీప ఫస్ట్ రిఫరల్ యూనిట్ సేవలు, అధిక ప్రమాద గర్భధారణల గుర్తింపు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, వ్యాక్సినేషన్, ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ, గర్భం దాల్చిన మూడు నెలల్లోపు ప్రతి మహిళ తప్పనిసరిగా ఏఎన్ఎంల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు అనంతరం మూత్ర పరీక్షలు, రక్త పరీక్షలు, రక్తపోటు, థైరాయిడ్, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తారని తెలిపారు. గర్భిణీలు తాజా ఆకుకూరలు, కూరగాయలు, ఉడకబెట్టిన గుడ్లు, పండ్లు, పాలు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని, ప్రతి నెలా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, డీఈవో విజయ, ఏఎన్ఎంలు మధువాణి, అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసింది మీ ప్రభుత్వమే

**టిపిసిసి సభ్యుడు షాబాద్ దర్శన్ ధ్వజం**

**మొయినాబాద్, జూన్ 9, ప్రభాతవార్త :** గత పదేళ్లపాటు అధికారంలో ఉండి హిమాయత్‌నగర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 151ను డంపింగ్ యార్డ్‌గా మార్చిన బీఆర్ఎస్ నాయకులే ఇప్పుడు అదే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "దొంగతనం చేసిన దొంగలే తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు దొంగ.. దొంగ అని అరిచినట్లుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారం ఉంది" అని వ్యాఖ్యానించారు. మంగళవారం మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హిమాయత్‌నగర్ రెవెన్యూలోని సర్వే నంబర్ 151 వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన నేపథ్యంలో టిపిసిసి సభ్యులు షాబాద్ దర్శన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలోనే ఆ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చిందని గుర్తు చేశారు. నేడు ఆ భూమి కాలుష్యానికి గురైందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు. సర్వే నంబర్ 151లో చెత్త డంపింగ్ కార్యకలాపాలు నిన్న మొన్నటి నుంచి ప్రారంభం కాలేదని, బీఆర్ఎస్ పాలనలోనే ఆ భూమి డంపింగ్ యార్డ్‌గా వినియోగించబడిందని తెలిపారు. ఆ విషయాన్ని ప్రజలు మరచిపోలేదని అన్నారు. గతంలో చేసిన తప్పులను ఒప్పుకోకుండా ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రైతులకు ప్రయోజనం చేకూరే విధంగా ఆధునిక సదుపాయాలతో కూడిన మార్కెట్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రత్యేక చొరవతో నియోజకవర్గ అభివృద్ధి కోసం అనేక ప్రణాళికలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా విక్రయించుకునేలా, మధ్యవర్తుల దోపిడీకి గురికాకుండా ఉండేలా ఆధునిక మార్కెట్ యార్డ్ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పేరుతో కోట్లాది ఎన్ ఆర్ జి ఎస్ విధులు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, స్మశానవాటికలు వంటి పనుల పేరుతో నిధులను ఖర్చు చేసినప్పటికీ వాటి నిర్వహణను పూర్తిగా నిరక్ష్యం చేసిందన్నారు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తూ ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. రాజకీయ విమర్శలు చేయడం కంటే అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించడం ప్రతిపక్షాల బాధ్యత అని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను వక్రీకరించి ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని, నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని షాబాద్ దర్శన్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ పట్నం రామిరెడ్డి, కాంగ్రెస్ రైతు సంఘం అధ్యక్షుడు తోలుకట్ట వెంకటరెడ్డి, చాకలి శ్రీశైలం, అమిత్ ఖాన్ పాల్గొన్నారు.